క్లుప్తంగా

భట్టిప్రోలు చేరిన ప్రజారక్షణ భేరీ బస్సు యాత్ర



భట్టిప్రోలు: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్సుయాత్రకు అనూహ్య స్పందన లభిస్తుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్రంలో నిర్వహిస్తున్న ప్రజారక్షణ ప్రచార భేరీ బస్సుయాత్ర బుధవారం రాత్రి భట్టిప్రోలుకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక రథం సెంటర్లో పార్టీ మండల కార్యదర్శి జి.సుధాకర్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో గఫూర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి, బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, రాష్ట్ర నాయకులు యు.ఉమామహేశ్వరరావు, దయా రమాదేవి, జిల్లా నాయకులు ఎంఏ చిష్టి, సీహెచ్ మణిలాల్, తదితరులు పాల్గొన్నారు.

చదువు మధ్యలో మానివేసిన వారికి దూరవిద్య ఉపయుక్తం

ఓపెన్ స్కూల్ రాష్ట్ర డైరెక్టర్ కె.నాగేశ్వరరావు



వెల్లటూరు(భట్టిప్రోలు): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన దూర విద్య ద్వారా చదువు మధ్యలో మానివేసిన వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఓపెన్ స్కూల్ రాష్ట్ర డైరెక్టర్ కె.నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం భట్టిప్రోలు మండలంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల చదువు మధ్యలో మానివేసిన వారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఓపెస్కూల్ విధానం ద్వారా పరీక్షలు రాసి అనేక రకాలైన ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.రాజేంద్ర ప్రసాద్, ఇంగ్లిష్ టీచర్ కె.ఎం.జసింత, లెక్చరర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు సూరేపల్లి విద్యార్థిని



సూరేపల్లి(భట్టిప్రోలు): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో గురువారం నుంచి విశాఖపట్నం జిల్లా అరకులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్‌కు చెందిన బొర్రా గీతికాశ్రీ ఎంపికైనట్లు హెచ్ఎం కె.శ్రీనివాసశర్మ బుధవారం తెలిపారు. ఎంపికైన గీతికాశ్రీని, శిక్షణ ఇచ్చిన పీఈటీ జీవీఎస్ నాగేశ్వరరావులను హైస్కూల్ పాలకవర్గ అధ్యక్షుడు వేపూరి చలమయ్య, కార్యదర్శి రావు వెంకట కృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం

భట్టిప్రోలు: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కడప ఉక్కు పరిశ్రమను నిర్మించాలని కోరుతూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బంద్‌లో భాగంగా భట్టిప్రోలు మండలంలో విజయవంతం అయ్యింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్షుడు పి. మనోజ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందన్నారు. బంద్ సందర్భంగా మండలంలోని కళాశాలలు, పాఠశాలలు, హైస్కూళ్లు, పాఠశాలలు మూసివేయించారు. బంద్‌కు సహకరించిన విద్యాశాఖ, యాజమాన్యలకు ఎస్ఎఫ్ఐ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మండల కార్యదర్శి జగదీష్, కమిటీ సభ్యులు విజయ్, శివ, సంజయ్, శ్యామ్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులపై కేసులు



తెనాలిరూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారికి రూరల్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కేసులు నమోదు చేశారు. తెనాలి మండలంలోని కొలకలూరు వంతెన వద్ద హాఫ్‌పేట గ్రామంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న నలుగురిని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి గుర్తించారు. వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని ఎస్ఐ హెచ్చరించారు.

ప్రగతికి దిక్సూచీ సీఎం జగన్ పాలన

- నాలుగున్నరేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోభివృద్ధి
- యువతకు ఉద్యోగాల వెల్లువ
- పరిశ్రమలు, విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు
- అందుకే రాష్ట్రానికి జగన్ అవసరం
- ఎమ్మెల్యే కోన రఘుపతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: రాష్ట్రానికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఎందుకు ఉందో.. ఈ నాలుగున్నరేళ్ల రాష్ట్రాభివృద్ధి దిక్సూచిని చూస్తే అర్థమవుతుందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. బుధవారం బాపట్ల పట్టణంలోని కోన భవన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత తలసరి ఆదాయం పెరిగిందని తెలిపారు. చంద్రబాబు హయాంలో జీఎస్డీపీ వృద్ధి రేటు 22వ స్థానంలో ఉందని, జగనన్న వచ్చాక ప్రథమ స్థానంలో నిలిచిందని వెల్లడించారు. తలసరి ఆదాయం చంద్రబాబు హయాంలో 17 స్థానంలో ఉంటే, వైఎస్సార్ సీపీ పాలనలో తొమ్మిదో స్థానానికి చేరిందని చెప్పారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో కేవలం 34,108 ఉద్యోగాలు కల్పిస్తే.. సీఎం జగన్ పాలనలో 4 లక్షల 93 వేల ఉద్యోగాలతో రికార్డు సృష్టించారని అన్నారు. ఇందులో 2,13,662 శాశ్వత ఉద్యోగాలని చెప్పడానికి గర్వంగా ఉందని పేర్కొన్నారు. ఏపీకి ఎందుకు జగన్ కావాలో చెప్పడానికి యువతకు ఇది చాలని అన్నారు.

రైతులకు పండుగ రోజులు..

రాష్ట్రంలో వ్యవసాయానికి ఈ నాలుగున్నరేళ్లు పండుగ రోజులని, రైతుల మోములో చిరునవ్వులే దీనికి నిదర్శనమని ఎమ్మెల్యే కోన అన్నారు. వైఎస్సార్ భరోసా ద్వారా ముందస్తు పెట్టుబడి నిధి అందడంతో రైతులు అప్పులపాలు కాకుండా చక్కగా వ్యవసాయం చేసుకుంటున్నారని చెప్పారు. ఏపీలో 8.2 శాతం వృద్ధి రేటుతో దేశంలోనే ఏపీ ఆరోస్థానంలో ఉందని, అందుకే అన్నదాతలు జగన్ కావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. స్వయంగా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది జగన్ ప్రభుత్వం మాత్రమేనన్నారు. అదే సమయంలో పరిశ్రమ స్థాపనలోనూ మంచి వృద్ధి సాధించిన లక్షల మందికి ఉపాధి కల్పించారని చెప్పారు.

విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు

రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, గత 50 ఏళ్లలో ఇలాంటి మార్పు చూడలేదని అన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి.. పేదింటి పిల్లలకు కార్పొరేట్ విద్య అందిస్తున్నారని తెలిపారు. అందుకే పేదింటి బిడ్డలంతా జగన్ మామ కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. నాడు–నేడు ద్వారా వైద్యాన్ని ప్రతి గడపకూ తీసుకొచ్చారని, ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా లక్షల మందికి ఆరోగ్యానికి భరోసా కల్పించారని చెప్పారు. అందుకే అవ్వతాతల ఆరోగ్యాన్ని గుప్పెట్లో పట్టి కాపాడుతుంటే.. జగన్ బాబు మళ్లీ రావాలి అని చెబుతున్నారని, అందుకే ఏపీకి జగన్ మళ్లీ కావాలని పేర్కొన్నారు. బాపట్ల పట్టణ మండల అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు, కోకి రాఘవ రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ కొక్కిలగడ్డ చెంచయ్య, బాపట్ల మండలం ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, కర్లపాలెం మండల జెడ్పీటీసీ వేణుగోపాల్ రెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ కూరపాటి మరియదాసు, పి.వి.పాలెం మండల అధ్యక్షుడు లీలాశ్రీనివాస్ రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ నాయకులు ఆట్ల ప్రసాద్ రెడ్డి, ఎస్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మూలపాలెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' ప్రారంభం ..

నేడు బాపట్ల మండలంలోని మూలపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే కోన వెల్లడించారు. అలాగే బాపట్ల పట్టణంలోని జేతనీకాలనీ, కర్లపాలెం, పీవీ పాలెం మండలాల్లోనూ నిర్వహిస్తామని, 10న పీవీ పాలెం మండలంలోని పిట్టువారిపాలెం, బాపట్ల మండలంలోని హనుమంత్ నగర్, కర్లపాలెం మండలంలోని నల్లమోతువారిపాలెం గ్రామాల్లో కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఆయా గ్రామాల్లో రాత్రి బస చేసి.. ప్రజలకు వైఎస్సార్ సీపీ పాలన గురించి వివరిస్తామని చెప్పారు.

బాల్య వివాహాలతో జీవితాలు అంధకారం

రాష్ట్ర బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు బి.పద్మావతి

రేపల్లె రూరల్: బాల్య వివాహాలతో జీవితాలు అంధకారంగా మారుతాయని రాష్ట్ర బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. బాల్య వివాహాలు – అనర్థాలు, బాల్య వివాహాలు నిషేధ చట్టంపై పట్టణంలోని పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో రేపల్లె పట్టణ, మండలంలోని అంగన్‌వాడీ, డ్వాక్రామహిళలు, మహిళా పోలీసులు, ప్రజాప్రతినిధులకు బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలు, ఇతర మహిళా అధికారులు తాము విధులు నిర్వహించే ప్రాంతాలలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి వివాహాన్ని నిలుపుదల చేయాలన్నారు. బాల్య వివాహాలు చేయటం చట్టవిరుద్ధమని, వివాహాలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. మహిళలకు 18, పురుషులకు 21 సంవత్సరాలు నిండే వరకు వివాహాలు చేయరాదన్నారు. ముఖ్యంగా ఈ వివాహాలు పల్లెప్రాంతాలలో ఎక్కువగా కనిపిస్తుంటాయని, గ్రామీణులను చైతన్యం చేసి బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలన్నారు. వివాహాలకు పాల్పడితే చట్టప్రకారం జైలుశిక్షతో పాటు బాలిక చదువుకు అయ్యే ఖర్చుతో పాటు వరుడు భృతిసైతం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. బాల్య వివాహాలను నివారించటంతో పాటు బాలికా విద్యను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంక్షేమ పథకాలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. అనంతరం బాల్య వివాహాలు చోటు చేసుకుంటే తీసుకునే చర్యలపై వివిధ చట్టాలను వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, తహసీల్దార్ డి.మల్లికార్జునరావు, పట్టణ సీఐ నజీర్ బేగ్, ఎంఈఓ సురేష్, ఇన్‌చార్జి సీడీపీఓ అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ విధానంపై శిక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

బాపట్ల అర్బన్: డాక్టర్ ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ బాపట్లలో హైడ్రోఫోనిక్స్ అనే నూతన వ్యవసాయ శిక్షణ కార్యక్రమం బుధవారం ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ పరిధిలో ఐకార్ గుర్తింపు ఉన్న నాలుగు వ్యవసాయ కళాశాలలు, రెండు వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలు, రెండు ఆహార సాంకేతిక కళాశాలల నుంచి 863 విద్యార్థినులకు డాక్టర్ ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ బాపట్లలో హైడ్రోఫోనిక్స్ అనే నూతన వ్యవసాయ విధానంపై నేటి నుంచి ఈనెల 11 వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్ హైడ్రోఫోనిక్స్ ద్వారా విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎలా అభివృద్ధి చెందాలో వివరించారు. బాపట్ల అగ్రికల్చర్ కాలేజ్ అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాబోయే కాలంలో హైడ్రోఫోనిక్స్ ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ బి.వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ బి.జాన్‌వెస్లీ హైడ్రోఫోనిక్స్ ఆవిష్కరణ, చరిత్ర గురించి తెలిపారు. హైదరాబాద్‌లోని ఐఏఏ ఫారమ్స్ లిమిటెడ్, గ్రో ఫ్రైజ్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల నుంచి శిక్షకులుగా డాక్టర్ ఎం. సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ ఎ.లక్ష్మిలు హైడ్రోఫోనిక్స్ పద్ధతిని వివరించారు. ప్రొఫెసర్ అండ్ హెడ్ డాక్టర్ జి.రవిబాబు, అసోసియేట్ ప్రొఫెసర్ అండ్ హెడ్ డాక్టర్ ఆర్.గణేష్ బాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.కళావతి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించండి



బంద్ సందర్భంగా విద్యార్థులను బయటకు పంపిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తెనాలిఅర్బన్: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించండంతో పాటు కడప ఉక్కు కర్మగార నిర్మాణాలను వెంటనే జరపాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యాసంస్థల బంద్‌ను నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు పట్టణంలో పర్యటిస్తూ విద్యాసంస్థలను మూయించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పారిశ్రామికవేత్తలకు కేంద్ర ప్రభుత్వం అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. లాభాల్లో ఉన్న ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయాలని కేంద్రం చూడటం బాధకరమన్నారు. ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అలాగే కడప స్టీల్ ఫ్యాక్టరీ వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్ది కిరణ్‌బాబు, నాయకులు చెన్నూరి సాయి, గుండు శివ, కుంభ రవితేజ, బిళ్ళ రాజేష్, అన్నం హేమచరణ్, కావేటి యశ్వంత్, కుప్పల కృష్ణ, పాశం వినయ్, కుర్రా పవన్ పాల్గొన్నారు.

నగర అభివృద్ధిలో ప్రణాళికా విభాగం పాత్ర కీలకం



మాట్లాడుతున్న కమిషనర్ నిర్మల్ కుమార్

మంగళగిరి: నగర అభివృద్ధిలో ప్రణాళికా విభాగం పాత్ర ఎంతో కీలకమని, నగర అభివృద్ధి చెందే విధంగా ప్రణాళికా ఎప్పటికప్పుడు మార్పులు చేసుకంటూ ముందుకు సాగాలని కార్పొరేషన్ కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రణాళికా విభాగం దినోత్సవం బుధవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్‌కు ఆదాయ వనరుగానే గాక ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఇంజినీర్లు, ప్లానింగ్ సెక్రటరీలు ఎంతో జాగ్రత్తగా ప్రజలకు అవసరమైన నిర్మాణాల కోసం అనుమతులు చేసేలా చూడాలన్నారు. ప్రభుత్వ స్థలాలతో పాటు రోడ్ల ఆక్రమణలు జరక్కుండా నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డీ మధుకుమార్, డీసీపీ కె.అశోక్‌కుమార్, స్కూలు ఆఫ్ లెర్నింగ్ ప్రొఫెసర్ నాగరాజు, ఏడీ రవికుమార్, ఏసీపీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల అపహరణ

చేబ్రోలు: మండలంలో బైక్ దొంగతనాలు పెరిగిపోతున్నాయి. ఒకే ప్రాంతంలో మంగళవారం రాత్రి రెండు బైక్‌లు అపహరణకు గురవ్వడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చేబ్రోలు నుంచి వడ్లమూడి వెళ్లే రహదారిలో వాటర్ ట్యాంక్ ప్రాంతంలో నివసిస్తున్న నాగిశెట్టి ఉదయకుమార్ రాత్రి ఇంటి ముందు బైక్‌ను పార్కింగ్ చేశారు. ఉదయం లేచి చూసే సరికి మాయమైంది. ఇదే ప్రాంతంలో ఎన్. సురేష్‌బాబుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని దొంగలు అపహరించుకు పోయారు. ఇద్దరు చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాతరెడ్డిపాలెం ప్రాంతంలో కూడా మరో బైక్ మాయమైనట్లు తెలిసింది.

అడ్డూ అదుపులేని చోరీలు

కొద్ది రోజుల కిందట నారాకోడూరు పాత కెనరా బ్యాంక్ ప్రాంతంలో సాయంత్రం సమయంలో షాపు ముందు ఉంచిన కొత్త బైక్‌ను దొంగలు మాయం చేశారు. నాలుగు రోజుల కిందట సుద్దపల్లిలో ఇంటి ముందు ఉంచిన మైలా చింతయ్యకు చెందిన బైక్ చోరీకి గురైంది. గత నెల రోజుల్లో మండలంలోని గ్రామాల్లో 20 వరకు బైక్‌లు దొంగతనానికి గురైనట్లు సమాచారం. పోలీసుల కళ్లు గప్పి దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు.

విల్హెల్మ్ రోంట్జెన్ సేవలు మరవరానివి

తెనాలిఅర్బన్: విల్హెల్మ్ రోంట్జెన్ సేవలు మరువరానివని జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యశాలలోని ఎక్స్‌రే విభాగంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే పితామహుడు విల్హెల్మ్ రోంట్జెన్ చిత్రపటానికి బుధవారం ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1895 నవంబర్ 8న ఆయన ఎక్స్‌రే కనుగొన్నట్లు చెప్పారు. 1901లో నోబెల్ ప్రైజ్‌ను ఆయన అందుకున్నారని తెలిపారు. నవీన్, జానీబాషా, జయకర్, గుంటూరు రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండండి

తెనాలిఅర్బన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ సీపీ 29వ వార్డు కౌన్సిలర్ రమావత్ కవితాభాయ్ కోరారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లోని వడ్డెర కాలనీలో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. మురుగు కాల్వలో ఆయిల్ బాల్స్ వేసి స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు లేకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, వై.అనుపమ, వై.లక్ష్మీనారాయణ, సచివాలయ అడ్మిన్ రాజ్‌కుమార్, సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించండి

తెనాలిఅర్బన్: ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని మండల విద్యాధికారి-1 మేకల లక్ష్మీనారాయణ సూచించారు. ప్రైమరీ పాఠశాలలో వ్యవస్థను బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైమరీ పాఠశాలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తరచు తనిఖీలు చేయాలని సూచించారు. అలాగే స్కూల్ రికార్డులను కూడా పరిశీలించాలన్నారు. సమావేశంలో ఎంఈఓ-2 వి.జయంతిబాబు, పలువురు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సుదురుపాడు పీహెచ్‌సీ వైద్యురాలు ఫరీనాబేగం అన్నారు. మండలంలోని బేతపూడిలో బుధవారం వైఎస్సార్ ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 200 మందికి వైద్యపరీక్షలు చేశారు. అందులో 70 మందికి షుగర్, బీపీ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. అనంతరం పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పరీక్షలు చేశారు.

త్వరలో సొసైటీ భూములకు శాశ్వత పట్టాలు

రేపల్లె ఆర్డీఓ హేలా షారోన్



లంక గ్రామాల సొసైటీ భూములను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ హేలా షారోన్

భట్టిప్రోలు: కృష్ణా నదీ పరివాహక లంక గ్రామాల్లోని సొసైటీ భూములకు శాశ్వత పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని రేపల్లె ఆర్డీఓ హేలా షారోన్ పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరులోని లంక గ్రామాలకు చెందిన సొసైటీ భూములను బుధవారం ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ భూములకు చెందిన లబ్ధిదారులు ఇంకా ఎవరైనా అర్జీలు ఇవ్వని పక్షంలో వెంటనే అందించాలని తెలిపారు. అనంతరం భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయల జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఓటరు నమోదుకు డిసెంబర్ 9వ తేదీ వరకు అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఓటరు జాబితాలో అభ్యంతరాలు పరిశీలించి రాజకీయ పార్టీల నాయకులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే మండలంలో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల పురోగతిని గూర్చి సంబంధిత అధికారులుతో సమీక్షించారు. తహసీల్దార్ ధూళిపూడి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, వెల్లటూరు సర్పంచ్ చౌటూరి లక్ష్మి, ఇన్‌చార్జి ఆర్ఐ శివరామకృష్ణ, వీఆర్వో ఎం.వినూష, హౌసింగ్ ఏఈ రావూరి సౌమ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, నాయకుడు గురిందపల్లి సునీల్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా నిష్పక్షపాతంగా ఉండాలి..

రేపల్లె: ఎవరి ప్రలోభాలకు గురికాకుండా ఓటర్ల జాబితాను నిష్పక్షపాతంగా రూపొందించేలా బీఎల్వోలు, అధికారులు పనిచేయాలని ఆర్డీఓ హేలా షారోన్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో బీఎల్వోలు, అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఒకే డోరు నంబరుపై 10 కంటే అదనంగా నమోదైన ఓటర్ల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. సర్వేలో రాజకీయాలకు తావులేకుండా మృతుల ఓట్లను తొలగించటంతో పాటు డబుల్ ఎంట్రీలను గుర్తించాలన్నారు. డబుల్ ఎంట్రీ ఓట్లు గుర్తించిన సమయంలో వారికి ఏ ప్రాంతంలో ఓటు హక్కుకావాలో స్వయంగా నమోదు చేసుకుని మరోప్రాంతంలో ఉన్న ఓటు హక్కును రద్దుచేసేందుకు సిఫారసు చేయాలన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ 18 సంవత్సరాలు నిండిన వారి నుంచి నూతన ఓటు హక్కు కల్పించేందుకు చైతన్యపరచాలని ఆదేశించారు. కమిషనర్ విజయసారథి, తహసీల్దార్ మల్లికార్జునరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు భట్టిప్రోలులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

భట్టిప్రోలు: భట్టిప్రోలు-1 సచివాలయంలో గురువారం సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరావు బుధవారం తెలిపారు. అలాగే జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం కూడా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

వేమూరులో..

వేమూరు: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 2.30 రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందని పోగ్రామ్ నోడల్ అధికారి చొప్పర శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని ఆయన తెలిపారు. గ్రామ సర్పంచ్ సజ్జా లక్ష్మీ తిరుపతమ్మ, ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు, అంగన్‌వాడీ సిబ్బంది గ్రామ సభలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

బేతపూడిలో..

రేపల్లె: మండలంలోని బేతపూడి గ్రామంలో ఈ నెల 9వతేదీ గురువారం సాయంత్రం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ (ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి)అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు హాజరయ్యే కార్యక్రమంలో ప్రజలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అదేవిధంగా పట్టణంలోని 23, 25వార్డుల పరిధిలోని ప్రజలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పార్టీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి తెలిపారు.

కర్లపాలెంలో..

కర్లపాలెం: మండలంలోని కర్లపాలెం గ్రామ సచివాలయం వద్ద గురువారం మధ్యాహ్నం 3గంటలకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే(వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించనున్నారని వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఏడుకొండలు తెలిపారు. తొలుత మధ్యాహ్నం గం 2.30లకు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ద్విచక్ర మోటారు వాహనాలతో ర్యాలీగా స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్దకు వెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం కర్లపాలెం సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించి పార్టీ జండా ఆవిష్కరిస్తామన్నారు. ఆతరువాత కర్లపాలెం గ్రామ సచివాలయం వద్దకు చేరుకుని సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తామన్నారు. అక్కడ జరిగే సభ అనంతరం వైఎస్సార్ సీపీ జండా ఆవిష్కరించి గ్రామ వలంటీర్లు, గృహసారథులు, సచివాలయం కన్వీనర్లతో కలసి ప్రతి గడప గడపకు వెళ్ళి గత ప్రభుత్వంలో, జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు అందిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించనున్నట్లు తెలిపారు.

పిట్టలవానిపాలెంలో..

పిట్టలవానిపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి గడపకూ సంక్షేమాన్ని అందించారని గుర్తు చేశారు. ఈనెల 9వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకుకావాలి అనే కార్యక్రమాన్ని గ్రామ సచివాలయాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 9వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు పిట్టలవానిపాలెం మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం గ్రామ సచివాలయం వద్ద నవరత్నాలు లబ్ధిదారుల డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాత్రి పిట్టలవానిపాలెం గ్రామంలో బసచేసి పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా ఇక్కడే నిద్రిస్తారని తెలిపారు.ఈకార్యక్రమంలో బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి పాల్గొంటారని తెలిపారు.

నేడు వేంకటేశ్వరుని ఆలయ ప్రతిష్ఠామహోత్సవం



హోమ పూజాధి కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

రేపల్లె రూరల్: మండలంలోని పోటుమెరక గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకుడు అగ్నిహోత్రం శేషాచార్యులు ఆధ్వర్యంలో గణపతిపూజ, ప్రత్యేక అభిషేకాలు, హోమాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రూ.10లక్షల తిరుమల తిరుపతి దేవస్థాన శ్రీవాణి ట్రస్ట్ నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయం, జీవధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాలు ఈ నెల 9వతేదీ గురువారం నిర్వహిస్తామని నిర్వాహకులు చెప్పారు. మహోత్సవాలలో శరణాగతి గోష్ఠి పీఠాధిపతి నరేంద్ర రామానుజ దాస స్వామీజీ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరు విష్ణువు పాల్గొంటారన్నారని, పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. రేపల్లె చెంచయ్య, సుందర రామరెడ్డి, కామయ్య, నాగరాజు, వాలేశ్వరరావు, లీలాకృష్ణ, కట్టా మహేష్, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, కన్వీనర్ పేరం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



ప్రత్తిపాడు: కంపెనీ క్వార్టర్స్ నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం, పొట్లపాడుకు చెందిన జవ్వాది నరేంద్రబాబు రెండు సంవత్సరాలుగా ప్రత్తిపాడు మండలం నడింపాలెంలోని ఆది శివం యార్న్ టెక్స్‌టైల్స్ కంపెనీలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అక్కడే కంపెనీ క్వార్టర్స్‌లో భార్యాపిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. దసరా సెలవుల నేపథ్యంలో గత నెల 15న భార్యాపిల్లలను అత్తింట్లో వదిలిపెట్టాడు. అప్పటి నుంచి కంపెనీ క్వార్టర్స్‌లో ఒక్కడే నివాసం ఉంటున్నాడు. అదే నెల 21వ తేదీ సాయంత్రం బయటికి వెళ్లి నేటి వరకు తిరిగిరాలేదు. నాటి నుండి ఇప్పటి వరకు వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో, బుధవారం తండ్రి సాంబశివరావు ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.